## కథ

# అనాథ

**"చిత్రా రాత్రి నేను చెప్పింది ఆలోచించావా?"**

**తల్లి మాటలకు చిత్ర "లాభం లేదమ్మా! నాకా ఆలోచన బాగు లేదు" అంది.**

**"రాత్రంతా నేను నీకు బోధపరిచింది ఒక్క మాటతో కొట్టిపారేశావు" వైదేహి నొచ్చుకుంటూ అంది.**

"అర్థం కాకపోవడానికి నేనేం పసిదాన్నా" చిత్రకు విసుగ్గా అనిపించింది ఆ సంభాషణ.

వైదేహి నవ్వింది.

"పసివాళ్ళకే అర్థం చేసుకొనే శక్తి ఉండదంటావా? నీకే కాదు నాకు కూడా ఈనాటికీ అర్థం గాని విషయాలు చాలా ఉన్నాయి. నా కళ్లకు నీవింకా చిన్నప్పుడు ఐస్‌క్రీమ్ కోసం మారాం చేసే చిత్రాలానే ఉన్నావు"

కూతురి మౌనం చూసి వైదేహి మెల్లగా అంది.

"నేనొకటడుగుతాను చెప్తావా?"

చిత్ర మాట్లాడలేదు.

వైదేహి ఒక క్షణం ఆగి "అనాథ శరణాలయంలో పిల్లలు బాగుండరని ఎందుకనుకుంటున్నావు?" అని అడిగింది.

"బాగుండరని నేనన్లేదు. అందంగానే, ఆరోగ్యంగానే ఉండొచ్చు కానీ ఏ కులమో? తలిదండ్రులెవరో? ఎక్కడ దొరికారో? ఇవేమీ తెలియకుండా ఎలా పెంచుకుంటామమ్మా?"

"ఆ వివరాలు తెలుసుకొని ఏం చేస్తావు" వైదేహి మాటల్లో కొంచెం కోపం తొంగి చూసింది.

"ఏం చేస్తాన్నది తర్వాతి విషయం. ఏ భిక్షగాడి పిల్లో, ఏ వేశ్య సంతానమో అయితే తర్వాత బాధపడాల్సింది నేనేగా!"

"ఆ వివరాలు తెల్సుకోకుండా ఎలాను తీసుకోం కదా చిత్రా! ఆరోగ్యంగా అందంగా ఉన్న పిల్లనే తెచ్చుకుందాం" వైదేహి అనునయంగా అంది.

చిత్ర నిట్టూర్చి సోఫాలో కూలబడింది.

"నీకు తెలియదమ్మా! ఆరోగ్యం అందమే కాదు ఎటువంటి వంశంలో పుట్టిందో తెలీకుండా ఎలా? వంశపారంపర్యంగా వచ్చే దుర్గుణాలు నువ్వెంత బాగా పెంచినా పోవు. ఉహూ! ఎంత కాలమైనా సరే నాకు తెలిసిన కుటుంబం నుండే బిడ్డను తెచ్చుకుంటాను."

"పోనీ ఇవన్నీ ఎందుకు? నువ్వే ఐ.వి.ఎఫ్. చేయించుకో కాస్త డబ్బు ఖర్చయినా నీ బిడ్డ నీకుంటుంది" కూతురి మాటలకు విసిగిపోయి వైదేహి అంది.

"అమ్మా" కొంచెం తీవ్రంగా అంది చిత్ర.

మళ్లీ మార్దవంగా మారి "అమ్మా! నీకిదివరకే చెప్పాను. ఐ.వి.ఎఫ్. అంటే ఏమిటి? ముక్కు మొహం తెలియని మనిషి బిడ్డకు నా గర్భంలో చోటివ్వడమా? అది ఏ తాగుబోతో, ఏ వేశ్యాలోలుడో, ఏ దొంగో అయితే నా బాధ ఎవరికి చెప్పుకోను. డాక్టరు మనకు చెప్పరు. కానీ వంశపారంపర్య లక్షణాలు బిడ్డను అంటిపెట్టుకొని జన్మిస్తాయి అంటారు. ఆ గుణగణాలతో ఆ బిడ్డ పెరుగుతుంటే ప్రేమగా చూడగలనంటావా? ఉహు! ఇక ఆ ప్రసక్తి వదిలెయ్యి."

"చిత్రా! ఈ తరం మనిషిలా మాట్లాడ్డంలేదు నువ్వు. ఈ హైటెక్ యుగంలో కూడా నీలో బూజుపట్టిన భావాలేంటి? నాన్నగారి స్నేహితుడు రామంగారు అనాథ శరణాలయ సెక్రటరీగా కూడా చేస్తున్నారు. మనం అడిగితే మంచి అందమైన, ఆరోగ్యమైన బిడ్డనే సెలెక్టు చేస్తారు. నీ పెంపకంలో మంచి గుణాలతో వర్ధిల్లేట్టు తీర్చిదిద్దు. నీ మీద నీకేమాత్రం నమ్మకం లేదా? ఒక నెలల పిల్లపై అందులోను తల్లిదండ్రులెవరో తెలియని పిల్లపై వాళ్ల ప్రభావం ఏమాత్రం ఉంటుంది. వాళ్ల గుణగణాల గురించి నువ్వంతగా ఆలోచించడం దేనికో నాకర్థం కావడం లేదు."

తల్లి మాటలకు అడ్డు వస్తూ చిత్ర "రేపే నేను మద్రాసు వెళ్లిపోతున్నాను. టికెట్ కూడా రిజర్వ్ అయింది. నీకు అవకాశం ఉంటే నీకు తెలిసిన కుటుంబాలలో వాళ్లు పెంపకానికి ఇస్తే ఏ బిడ్డయినా తీసుకుంటాను. వెంటనే నాకు ఫోన్ చెయ్యి."

మరో మాటకు అవకాశం లేకుండా పడకపై ముసుగుతన్నింది.

వైదేహి ఒక నిట్టూర్పు విడిచి వంట గదిలోకి వెళ్లిపోయింది.

పడకపై పడుకున్నా చిత్ర మనసులో ఆలోచనా తరంగాలు వెల్లువెత్తాయి.

తన అభిప్రాయం తల్లికి నచ్చలేదని తెలుస్తూనే ఉంది.

కానీ తన ఇష్టం. తన భర్త ఇష్టం.

ఈ విషయంలో భర్త తనకు పూర్తి స్వాతంత్ర్యం ఇచ్చినప్పుడు ఆ గౌరవం దక్కించుకోవాలి.

కానీ-

ఈ సమస్యనెలా పరిష్కరించుకోవాలో తనకర్థం కావడం లేదు.

తన ఫ్రెండ్ వకుళకు మూడోసారి కూడా ఆడపిల్లే పుట్టింది. ఆ పిల్లను తను దత్తత చేసుకోవాలని ఒకసారి తల్లితో అడిగించాలని ఇంత దూరం వచ్చింది.

తన మాటను తీసెయ్యలేక వకుళను అడిగింది దత్తతకు అమ్మ.

దానికి బదులు...వకుళ అత్తగారు గయ్యమంటూ అమ్మను అనరాని మాటలందంట. ఆ దెబ్బతో అమ్మ మనసు బాధపడి ఈ అనాథ శరణాలయం ప్రపోజల్ పెట్టింది.

తల్లి సహకారం లభిస్తుందని ఆశతో మద్రాసు నుండి వైజాగ్ వచ్చింది.

రేపే మద్రాసుకు టిక్కెట్ రిజర్వ్ అయిపోయింది.

తల్లికీ విషయంలో అంత పట్టుదల ఎందుకో? తన కర్థం కావడం లేదు.

పైగా తనపై కోపం కూడా వచ్చినట్టుంది.

చిత్రకి నిరాశగా నిస్సత్తువుగా అనిపించింది.

చెన్నై వచ్చిన చిత్ర తల్లి ఫోన్‌కాల్ కోసం ఎదురుచూస్తుండగా 'పోస్ట్' అంటూ ఓ బరువైన కవరును ఇంట్లోకి గిరాటేసి వెళ్లిపోయాడు పోస్ట్‌మేన్.

'ఫోన్ వచ్చిన దగ్గర్నుండి అమ్మ లెటర్స్ రాయడం తగ్గించింది. మళ్లీ ఇన్నాళ్లకా? ఏదో ముఖ్యమైన విశేషం ఉంటే గానీ ఇంత పెద్ద లెటర్ రాయదు. లేఖ చించిన చిత్ర కళ్లు అక్షరాల వెంబడి పరుగులు తీశాయి.

"ప్రియమైన చిత్రకు

అమ్మ ఆశీర్వదించి వ్రాయునది.

నీవు చెన్నై వెళ్లినప్పటి నుండి నా ఫోన్ కాల్‌కు ఎదురుచూస్తావని తెల్సు! కానీ, ఈ విషయాలు ఫోన్‌లో మాట్లాడ్డం కుదరదు. కనుక లెటర్ రాస్తున్నాను.

చిత్రా!

నువ్విక్కడ ఉన్న ఆ వారం రోజులు నేను నీకెన్నో విషయాలు చెప్పాలనుకున్నాను. కానీ వాటి పరిణామాలు ఎలా ఉంటాయోనని భయంతో తటపటాయించేను. బాగా ఆలోచించి చివరకు చెప్పడానికే నిశ్చయించాను.

ఏ విషయమో నీకు ఈసరికి అర్థమై ఉంటుంది.

అనాథ శరణాలయ బిడ్డను గురించి నేనెందుకంత మొండిపట్టుదల చూపిస్తున్నానో నీకర్థం కాదు.

ఏనాటికైనా ఈ సంగతి చెప్పాల్సిన అవసరం వస్తుందని అనుకోలేదు.

బహుశా చెప్పేయడం మంచిదని ఇప్పుడనిపిస్తుంది.

చిత్రా!

నేను చెప్పే ఈ సంగతులు నీకెంతో బాధ కలిగించవచ్చు. కానీ, తొందరపడి మనసు పాడుచేసుకోకు! కొంచెం ఆలోచిస్తే ఇందులో బాధపడాల్సింది ఏమీ లేదని నీకే అర్థమవుతుంది.

చిత్రా!

నువ్వు నా కన్నకూతురివి కాదు."

**పి.మంగవేణి**

చిత్ర కళ్లు అక్షరాల వెంట పరుగులు తీయడం మానేశాయి.

నిమిషం తరువాత ఆమె కళ్లకు చలనం వచ్చింది.

ఉత్తరం ముందుకు సాగింది.

"నిన్ను హాస్పిటల్ నుండి తెచ్చి పెంచుకున్నామమ్మా..

ఇన్నాళ్లు ఈ రహస్యం ఎందుకు దాచామని నీవు ప్రశ్నించవచ్చు!

దానికి పెద్ద కారణమేమీ లేదు! ఆ అవసరం కనిపించలేదు.

నీవు ఈ రోజున నీ దురదృష్టం కొద్దీ గొడ్రాలితనం అనుకుంటున్నది నీ తల్లిది కూడా అని చెప్పలేక మానసికంగా ఎంతో వ్యధ అనుభవించాను.

నీకు రెండు అబార్షన్‌లు అయిన తరువాత గర్భసంచి తీసేశారు.

ఈ రోజు నువ్వు పడుతున్న బాధ చూస్తుంటే నీకు ఆనాడు నేను పొందిన చిత్రహింస పునరావృతమవుతున్నట్లే అనిపించింది.



పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు వాటికి తలొగ్గి నిర్వికారంగా ఉండటమో? లేక వీటిని తప్పించుకొని మరో మార్గం చూసుకోవడమో? ఈ రెండింటిలో ఏదో ఒక మార్గాన్ని మనిషి అనుసరించాలి.

చిత్రా!

నేను రెండవ మార్గాన్ని ఎన్నుకున్నాను.

నేను బిడ్డల్ని కనలేకపోవచ్చు! కానీ బిడ్డల్ని ప్రేమించే హక్కు నాకుందిగా. దాన్ని నా నుండి తీసుకునే అధికారం ఆ భగవంతుడికి కూడా లేదు. ఆ ఒక్క నమ్మకమే నేను కృంగిపోకుండా నన్ను కాపాడింది.

నీలాగే నేను కూడా మంచి సంప్రదాయం, తెలిసిన కుటుంబం నుండే పిల్లను తెచ్చుకోవాలనుకున్నాను. కానీ మీ నాన్నగారు ఒప్పుకోలేదు. తనకి మొదటి నుంచి అనాథపిల్లలంటే జాలి, దయ, ప్రేమ. పెంచుకుంటే అనాథపిల్లనే తెచ్చుకుందాము లేకపోతే లేదు అని మొండి పట్టు పట్టారు. ఆయన మాటకు ఎదురాడే శక్తి లేదు ఈనాటికి కూడా!

మర్నాడు!

బిడ్డను తెచ్చుకుందామని శరణాలయానికి బయల్దేరుతుండగా, మీ నాన్నగారితో పనిచేసే చక్రధర్‌గారు వచ్చి ఒక పేపర్ కటింగ్ ఇచ్చారు.

అందులో- హాస్పిటల్‌లో రాత్రి ఆడపిల్లను ప్రసవించిన తర్వాత సిబ్బంది కళ్లు కప్పి పిల్లను వదిలేసి అత్తతో పారిపోయిన లంబాడీ యువతి చుక్కీ!

లంబాడీ తండాకు చెందిన చుక్కీకి ఈ పిల్లకాక ఇంకా ముగ్గురు ఆడపిల్లలున్నారు. మగపిల్లవాడు పుడతాడని ఆశపడ్డ చుక్కీకి ఈ పిల్ల మరింత భారంగా తోచి పలాయనం చిత్తగించింది. మీకిష్టమైతే ఆ అమ్మాయిని తెచ్చుకోవచ్చు. నేను వెళ్లి చూశాను. చక్కని చుక్కలా ఉంది.

చక్రధర్ మాటలు- బొత్తిగా జిప్సీ తెగకు చెందిన అమ్మాయి. వాళ్ల వంశపారంపర్య లక్షణాలు ఈ పిల్లకు రావని నమ్మకం ఏంటి? నసుగుతూ అన్నాను. మీ నాన్నగారు నా మాటలు లక్ష్యపెట్టక హాస్పిటల్‌కు తీసుకెళ్లాలన్నా అయిష్టంగానే ఆయన వెంట వెళ్లిన నేను, నర్సుల చేతిలో వున్న నిన్ను చూసి అన్నీ మరచిపోయాను. చక్కని ఉంగరాల జుత్తుతో, విశాల నేత్రాలతో, మొనతేలిన సూది గడ్డంతో సంపెంగ రంగు వంటి చాయతో ఆదమరచి నిద్రపోతున్న నిన్ను వదలబుద్ధి కాలేదు. హాస్పిటల్ లాంఛనాలు పూర్తి చేసి నిన్ను మా దగ్గరకు తెచ్చుకున్నాము.

చిత్రా!

ఈ రోజు నీ సంస్కారం ఎలాంటిదో, నీ అలవాట్లు, ఆచారాలు ఎలాంటివో నీకే తెలుసు! నీ వంశపారంపర్య లక్షణాలు రాకుండా మా పెంపకంలో నువ్వు సుగుణశీలిగా, చదువులరాణిగా పెరిగి మంచి గృహిణిగా పేరు తెచ్చుకున్నావు.

మనిషి వ్యక్తిత్వం కేవలం అతని వంశగుణాలపైనే ఆధారపడి ఉండదు. పెరిగే వాతావరణం, పెంచే విధానం, చదివే పరిసరాలు, వీటన్నింటికీ ఈ విషయంలో ఎంతో ప్రాధాన్యం ఉంది.

నాకు విద్య ఉంది, లోకజ్ఞానం ఉంది, విన్నది ఆలోచించి అర్థం చేసుకునే సంస్కారం ఉంది. నీకింత కంటే వివరంగా చెప్పాల్సిన అవసరం లేదని నీ నమ్మకం.

నేను ఈ రహస్యాన్ని నీకు చెప్పడం వలన మా ప్రేమను నువ్వు శంకించడంగానీ మమ్మల్ని పరాయి వాళ్లుగా భావించడం గానీ జరుగుతుందేమోనని మొదట్లో భయపడ్డాను.

కానీ నేను పెంచిన చిత్ర మనసు తెలుసు కనుకనే ధైర్యంగా చెప్పగలిగాను. నువ్వే రోజైనా అనాథలా ఫీలయ్యావా? ఆలోచించు చిత్రా?

నీ భావం మార్చుకొని ఇంకొక అమాయక ప్రాణిని నీ ప్రేమామృతంతో పెంచి పెద్ద చెయ్యి! నిర్ణయం నీకే వదిలేస్తున్నాను."

ప్రేమతో

అమ్మ

ఉత్తరం పూర్తి చేసి చిత్ర కుర్చీలో నుండి లేవలేదు.

తను జిప్సీ తెగకు చెందిన పిల్లా? తల్లి తనను పెంచలేక హాస్పిటల్‌లో వదిలేస్తే ఈ కరుణామయి చేతుల్లోనా పెరిగింది.

అందుకే అన్నారు. 'కన్న ప్రేమ కంటే పెంచిన ప్రేమ గొప్పదని"

తను అనాథ కాదు!

అమ్మలాంటి ప్రేమమూర్తి నీడలో తన వ్యక్తిత్వం తీర్చిదిద్దుకొంది.

అమ్మ చెప్పినట్లు తమ ప్రేమ నీడలో పెరిగే బిడ్డ అనాథ ఎలా అవుతుంది?